# కుంకుమ

శకూ అక్కను ఇప్పుడు చూట్టం అంటేనే దిగులు. ఇన్నేళ్లూ పోయి చూడలేకపోయినందుకు బాధ, పశ్చాత్తాపం. ఆ ఊరు వెళ్లటం ఎడారి ప్రయాణం. ఎక్కడో పదిమైళ్ల దూరంలో బస్సు వదిలేస్తుంది. అక్కణ్నించి కాలినడక. లేదా ఎడ్లబండి. ఇప్పట్లో వెళ్లక పోతేనో, ఈ ఆంధ్రదేశం మళ్లీ రావటం ఏ రెండేళ్లకో! ముందుగా ఉత్తరమన్నా రాయలేకపోయాను.

నుదుట కుంకుమ కన్పించని అక్కముఖం చాలాసార్లు కళ్లముందు కన్పించసాగింది. ఆ సముద్రం ఒడ్డు అగ్రహారగ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఆ బంగళాను తొలిసారి చూసినప్పటినించీ ఆ ఊరంటేనే ఇష్టం ఉండదు. గోడల పగుళ్లలోంచి రావిమొక్కలు, పైకప్పు పెంకు నాచుపట్టి గడ్డి పెరిగిన దృశ్యం, లోపల గదుల్లో గబ్బిలాల కంపు, చీకటి, కిటికీలు తీసిచూస్తే అల్లుకుపోయిన సాలెగూళ్లు, పందికొక్కులు చేసిన రంధ్రాలు, చీమలు తవ్విన మట్టి — అట్లాంటి ఇంట్లో కోడలుగా అక్క అడుగుపెట్టినందుకు నా మనసునిండా నిస్సహాయమైన ఆగ్రహం.

ఇప్పుడు...

దీనంగా...

ఎన్నో అవమానాలు మోస్తున్నట్టుగా...

గుర్తుపట్టలేకపోయాను. శకూ అక్క ఇప్పటిరూపం...

దేవతలాంటి అక్క... ఇప్పుడు జబ్బుమనిషి...

ఊరు బళ్లో ఒకటోతరగతి చదువుకుంటున్న సుభాష్, నేను వెళ్లిన పదిహేన్నిమిషాలకి వచ్చాడు. 'మామయ్యరా... చిన్నమామయ్య...' అంటే అనుమానంగా చూశాడు. దగ్గరకు తీసుకుంటే ఏడుపు తెచ్చుకుని జారిపోయి వెళ్లిపోయాడు.

శకూ అక్క మొదట నాన్నగారి ఆరోగ్యం గురించి అడిగింది. హోమియో మందులు వాడుతున్నారు. ఆరోగ్యం మెరుగయిందని చెప్పాను. అమ్మ గురించి అడిగింది. బావుందన్నాను. శకూ అక్క దిగులుతో అమ్మ పడుతున్న బాధ గుర్తొచ్చి దిగమింగుకున్నాను. అన్నయ్య గురించి అడిగింది. కొత్తగా వచ్చిన ప్రొమోషన్, ఇంటిపై అంతస్తు, రేణు పెళ్లి ఆలోచన, చదువుకోవాలి పెళ్లి వద్దు అన్న శుభ పట్టుదల — చాలాసేపే ఆ ముచ్చట్లు సాగాయి. శుభ, వెంకటేశ్వర్లు గురించి — పేర్లు గుర్తుపెట్టుకుని అక్క అడగడం విచిత్రంగా ఉంది. పిల్లల్నిగాని శ్యామలనిగాని అక్క చూడలేదు. పెళ్లి అయ్యాకా ఇటురావటం మాకు కుదరలేదు. ఏవో ఆటంకాలు. మా పెళ్లిరోజుల్లో శకూ అక్క జబ్బుపడింది. పెళ్లికి రాలేకపోయింది. ఢిల్లీ స్కూల్స్‌లో పిల్లల చదువు గురించి ఎంతో ఆసక్తిగా విన్నప్పుడు — సుభాష్ బడినుంచి వచ్చిన తీరు మరోసారి గుర్తొచ్చింది. ఢిల్లీ ముచ్చట్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. శూన్యంలోకి చూపులతో దుఃఖాన్ని ఆపుకోలేక బొటబొట కన్నీళ్లు కార్చి మొఖాన్ని చేతులతో కప్పుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

ఏడుపు విని మామయ్య ఆ గదిలోకి వచ్చాడు. అత్తా, ఇంట్లోని ఇతర మనుషులూ ఏదో ఉపద్రవం ముంచుకు వచ్చినట్టు ఆ గదిలోకి వచ్చారు. అక్కను చుట్టు ముట్టారు. గదిబైట నించి చూస్తున్నాను. ఉద్రేకపడి ఆపుకోలేక ఏడుస్తున్నది. ఆ ఏడుపు విచిత్రంగా ఉంది. అక్కడ చేరిన ఆడవాళ్లు గుసగుసలు కూడా వింత అనిపించాయి. అక్కను వాళ్లు పక్కగదిలోకి తీసుకు పోయారు.

మన సాంఘిక వ్యవస్థలో ఏర్పడిన ఈ సంబంధాలు ఎంతవరకు మేలు చేస్తున్నాయో ఏమో! చిన్నవయసులోనే భర్త చనిపోయాడు. రెండోపెళ్లికూడదు. కట్టుబాట్లు. చిన్నపిల్లవాడు. నిర్బంధాలు. అవమానాలు. స్వంతంగా బతకలేని నిస్సహాయత. కుటుంబ మర్యాదలు. కులధర్మాలు. నీతి, ధర్మం, బాధ్యత — ఎన్నెన్నో బంధాలు. వాటి మీదికి ఎదురుతిరగలేని, వాటినించి తప్పించుకుని బైటపడలేని

దుస్థితి.

నాకు అర్థమయిందేమిటంటే అక్కను వాళ్లంతా కలిసి గుండె బరువు తీరేట్టుగా ఏడవనన్నా ఏడవనివ్వటం లేదని.

క్షణం క్రితం నన్ను ఆనందంతో పలకరించిన మామయ్య ఇప్పుడు నావేపు కొరకొర చూస్తున్నాడు. అక్కడ ఆ దృశ్యాన్ని చూస్తూ కూర్చోలేక వీధిలోకి వెళ్లిపోయాడు.

ఈ పదేళ్లకాలంలో దేశం ఎంత మారిపోయింది. మాది విజయనగరం. మద్రాసునించి విడిపోయి ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన కొత్తలో అన్నయ్యకు ఉద్యోగం సెక్రెటేరియట్‌లో వచ్చింది. కర్నూల్, తర్వాత హైదరాబాద్. వాడి ఆరోగ్యం బాగాలేదని అమ్మా, నాన్నా, అక్కా హైదరాబాద్ వెళ్లారు. మరుసటి ఏడు నన్నూ, అమ్మమ్మనూ తీసుకుపోయారు. సరిగ్గా ఆ రోజుల్లోనే అక్క పెళ్లయింది. బావగారు బాగా చదువుకున్నవాడు. శ్రీకాకుళం వేపు, వందన్నర ఎకరాల ఆస్తి, అగ్రహారం భుక్తలు. వాళ్ల ఇళ్లు జమీందార్ల ఇళ్లులా ఉండేవి.

అప్పట్లో శకూ అక్కకు ఈ సంబంధం కుదిరిందంటే — దాని అదృష్టం అని ఎంత సంతోషించారో. — శకూ అక్క అందం అలాంటిది. దానికి తోడు అక్క సంగీతం. ఆమె పాట. వాళ్లస్థాయిలో పెళ్లి చేయటానికి పల్లెటూళ్లో ఉన్న పదెకరాల భూమి ఆ చవుక రోజుల్లో మేము అమ్ముకోవాల్సి వచ్చింది. ఆడపిల్ల ఒక్కతే కాబట్టి దాని పెళ్లికి ఏ లోటూ చేయకూడదని అమ్మా, నాన్న, అన్నయ్య పట్టుబట్టి పెళ్లి ఘనంగా చేశారు.

పెళ్లైన మూడు నాలుగేళ్లల్లోనే పరిస్థితులు తారుమారయిపోయాయి. కిందకోర్టుల్లో ఇనామ్‌దారీ వివాదాల్లో గెలుచుకున్న భూములు పై కోర్టుల్లో రైతులు గెలుచుకున్నారు. జమీందారీ రద్దు చట్టాలు కొత్తగా వచ్చాయి. ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబం అవటం వల్ల ఆర్థికంగా బాగా దెబ్బతిన్నారని విన్నానేగాని ఇంటికి కనీసం వెల్లవేయించుకోలేని ఈ స్థితికి దిగజారిపోయారని ఊహించలేక పోయాను. శకూ అక్క ఇంత దుర్భరజీవితాన్ని మోస్తున్నదని తెలీలేదు నాకు.

నా లేత కళ్లతో కళకళలాడుతున్న పచ్చటి పెళ్లి పందిరితో ఈ ఇల్లు చూశాను. మామిడాకుల తోరణాలు, కొబ్బరికమ్మల పెళ్లిపందిరి, అరటి చెట్ల అలంకరణతో కళ్యాణమంటపం ఎంతో అందంగా కన్పించింది.

అన్నయ్య ఉద్యోగం తర్వాత నాన్నగారు కూడా ఓ తెలుగు పత్రికలో చేరటంతో ఇంక హైదరాబాద్‌లో స్థిరపడ్డాము. సకాలంలో వైద్యసదుపాయం లేక జబ్బు

తీవ్రతపట్ల నిర్లక్ష్యంతో బావ చనిపోయాడు. వారసుడయిన కొడుకుకోసం, మిగిలిన ఆ పాతకాలపు ఇల్లుకోసం, అంతాపోగా మిగిలిన ముప్పయి ఎకరాల భూమికోసం అక్క ఈ గుహల్లో బతుకుతున్నది. బావ పోయినప్పుడు అయిదేళ్ల కిందట అమ్మా, నాన్న, అన్నయ్యా వచ్చి చూశారు. ఈ బాధ వాళ్లకు అర్థమయినట్టులేదు. విజయనగరంలో ఉంటున్న చిన్నాన్న ఉత్తరాలు రాస్తూ ఉంటాడు. ఎప్పుడూ ఈ దయనీయ జీవితం గురించి సూచన ప్రాయంగానన్నా రాయలేదు. కొందరికి ఇవి కష్టాలుగా కనిపించవు. జీవితం ఎండానీడా. అట్లాగే ఉంటుంది అనుకుంటారే తప్ప కొత్తజీవితం వేపు ఆలోచించరు. ఆ ఆలోచన రాదు. దానికేం — కొడుకున్నాడు. ఊళ్లో వాళ్లకు కోటలాంటి ఇల్లు. ఇంకా ముప్పయి ఎకరాల భూమి మిగిలింది. ఆ కొడుకును చూసుకుని బతకాలి. అత్తా మామా మంచివాళ్లు. సొంతకూతుర్లా చూసుకుంటున్నారు.

అక్కను ఒక్క నిమిషం కూడా అక్కడ ఉంచకూడదని అన్పించింది నాకు. ఆ రాత్రంతా నిద్రలేదు. అక్కను నాతోపాటు హైదరాబాద్ తీసుకుపోవాలి. నాన్నగారి అనారోగ్యం గురించి చెప్పి ఒప్పించి అక్కనీ, సుభాష్‌నీ తీసుకుపోవాలి. ఉపాయం ఆలోచిస్తున్నాను. ఇక్కడ ఇట్లాగే ఉంటే రెండు మూడేళ్లల్లో అక్క చనిపోవడం ఖాయం. అది నన్ను భయపెట్టసాగింది. రెండుమూడేళ్లు కూడ బతుకుతుందో లేదో. అక్కను కాపాడుకోవాలి. మా ఇంటికి ఉన్న ఒకే ఆడపిల్ల, కూతురు, చెల్లెలు, అక్క... ఆడపడచు మా అందరికీ. అక్క ముఖం విచ్చుకోవాలి. ఆ పెదవుల్లోంచి మళ్లీ నవ్వులు కురవాలి. ఆ గొంతులోంచి మళ్లీ పాటలు ప్రవహించాలి. అక్క ఎంత గొప్పది! మహాగాయనిగా రాణించేది ఢిల్లీలోనే ఉంటే. ఢిల్లీలో సాంస్కృతిక కార్యక్రమాలు చూసినప్పుడల్లా శకూ అక్కే గుర్తొచ్చేది.

* * *

బ్రాంచి పోస్టాఫీస్‌నించి లైబ్రరీకి వచ్చే దినపత్రికను తెచ్చి మామయ్యకు ఇవ్వటం సాంబం పని. తపాలాసంచి ఆ ఊరుకు పదకొండు గంటలకు వస్తుంది. ఆ పత్రికలో సాంబంకి సినిమాబొమ్మలు చూట్టం ఇష్టం. వంశపారంపర్యమైన చర్మవ్యాధి ఏదో సాంబానికి ఉన్నట్టుంది. చర్మం ఎండిపోయినట్టుగా ఉంటుంది. బూడిద పూసుకున్నట్టు, ముఖం మీద, శరీరం అంతటా సన్నటి నూలుపోగుల్లాగ పగుళ్లు. మెడపొట్టిది కావటంవల్ల తలకాయ భుజాల మీద పడుతుంది. మామూలు ఎత్తే అయినా అల్పమైన శరీరం.

పంచాయితీ లైబ్రరీని బావగారు తమ ఇంట్లోనే వరండాగదిలో ఏర్పాటు చేశారు. అది సామాన్యంగా తెరిచే ఉంటుంది. లైబ్రరీనించి తీసుకువెళ్లిన కాశీ మజిలీ కథలు ఇవ్వటానికి వచ్చినప్పుడు సాంబంతో పరిచయం. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా - ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాట్ట. ఆరోగ్యం సంగతి శ్రద్ధ తీసుకోమని చెప్తే మందులు కొనుక్కోటానికి పైసల్లేవు అన్నాడు. ఉద్యోగం దొరికితే మందులు కొనుక్కుంటాను బాబుగారూ అన్నాడు. సాంబం జవాబు విన్నప్పుడు సాంబం పేదరికం తెలిసింది.

మామయ్య ఊళ్లో నా గురించి కనిపించిన వాడికల్లా, వాళ్లు అడిగినా అడక్కపోయినా మా కోడలు శకుంతలమ్మ తమ్ముడు, ఢిల్లీలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు అని పొగడ్తలతో లేనిపోని గొప్పలు చెప్పడం నేను గమనించాను. ఆ చెప్పిన మాటల్లో ఒకటే సత్యం. ఢిల్లీలో ఉద్యోగం చెయ్యటం మాత్రమే. కేంద్రప్రభుత్వం ఆఫీసర్ హోదా ఉద్యోగం అంతే. పూర్వం రోజుల్లో ఇంగ్లీష్ వాళ్లపాలనలో తెల్లదొరలు తమ ఇంట భోజనాలు చేసి వెళ్లేవాళ్లని, తమ భవంతిలో ఉండి వేటకు వెళ్లేవాళ్లని, తమ తాతల ఘనతను కూడా అదే ధోరణిలో చెప్పుకుంటాడు ఆయన ఇప్పటికీ. ఆ ఉదయం ఆ ఊళ్లోకి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వచ్చినప్పుడు — అధికార్లు ఎవరు వచ్చినా మామయ్య గారింటికే వస్తారు. వాళ్ల పాతమర్యాదలూ, మన్ననలూ ఏ లోటూ లేకుండా సాగుతూనే ఉన్నాయి — ఆ రెవెన్యూఇనస్పెక్టర్ గొంతులో వినయమూ, గౌరవమూ విన్నప్పుడు — ఈ పాత గొప్పలకోసం ఆ ఇల్లు ఇంకా దృఢంగానే నిలబడి ఉండిపోయింది అనిపించింది.

మనదేశానికి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి. రాష్ట్రపతి కామరాజ్ నాడార్. మనదేశంలో ప్రధానభాష తెలుగు. మల్లా ఇంగ్లీషు దొరలొచ్చి ఏలితే తప్ప ఈ దేశం బాధలు తప్పవు — ఇదీ సాంబం చదువు. టీచర్ ఉద్యోగం తప్పించి వేరే ఉద్యోగం ఏదన్నా మంచిది కదా అని సాంబంతో చెప్పాను. స్వరాజ్యం వచ్చిన ఇరవైయ్యేళ్ల తర్వాతకూడా ఈ ఊళ్లో స్వరాజ్యం అడుగుపెట్టలేదు. దాదాపు పన్నెండేళ్ల కిందట నేను చూసినప్పటికన్నాకూడా ఊరు మరింత క్షీణించినట్టే అనిపించింది తప్ప బాగుపడినట్టు కన్పించలేదు. కులాలు అట్లాగే ఉన్నాయి. అంటరానితనం అట్లాగే సాగుతున్నది. ఆ ఊళ్లోకి కనీసం కొత్తగా ఒక రోడ్డుకూడా లేదు. పాత బండ్లదారే. చెరువు గట్లమీంచి, పొలాల మధ్యనించి పిల్లకాల్వలను దాటుకుంటూపోయే కాలిబాటే.

ఆ సాయంత్రం సముద్రాన్ని చూట్టానికి వెళ్లినప్పుడు సాంబం నాకు తోడు.

సముద్రం అంటే శకూ అక్కకు ఎంతో ఇష్టం. పిన్నిగారింటికి వైజాగ్ వెళ్తే మహరాణిపేట బీచ్‌లో ఆడుకునేవాళ్లం. నాకు బాగా గుర్తు — 'వాళ్లూరుకి సముద్రం చాలా దగ్గరట. సముద్రం హోరు రాత్రిపూట విన్పిస్తుందటరా తమ్ముడూ' అని పెళ్లి చూపులు తర్వాతే అక్క నాతో చెప్పటం. పెండ్లి అయిన తర్వాత మొట్టమొదటిసారి అత్తవారింటికి వస్తున్నప్పుడు చీకటి రాత్రి — పల్లకిలో కూర్చుని నిద్రమత్తులో ఊగుతున్న నన్ను నిద్రలేపి మా ముందూ వెనకా పాతిక ముప్పయి ఎడ్లబళ్ల గంటల మోతలో 'తమ్ముడూ, ఆ సముద్రపు మోత విను — విన్నావురా'అని చెప్పటం నాకు బాగా గుర్తు. పెళ్లి తర్వాత తొలిసారి సంక్రాంతి పండగకు బావతో వచ్చినప్పుడు 'ఆరుసార్లు సముద్రానికి వెళ్లాను. బావగారు అయిదుసార్లు తీసుకువెళ్లారు. సూర్యగ్రహణం స్నానాలకు ఊళ్లోవాళ్లతో ఒకసారి వెళ్లాను...' శకూ అక్కకు సముద్రం ఒక గొప్ప ఆకర్షణ.

హోరున కెరటాలు విరుచుకుపడి, మోకాలి వరకు తడిపి వెనక్కి మళ్లిపోతున్నాయి. సముద్రపు పిట్టలూ, నీటికాకులూ ఒడ్డున ఎగురుతూ సముద్రపు పురుగుల్ని ఏరుకుంటున్నాయి. తూర్పున ఆకాశం కలిసేచోటు వరకూ వ్యాపించిన నీలం సముద్రం. ఆ సముద్రం నీలాలు — సాయంత్రం ఎండలో మణుల్లా మెరుస్తున్నాయి. ఒడ్డున కెరటాల నృత్యంతో, సంగీతంతో, మనస్సును మంత్రించే అందాలు. కనుచూపుమేర ఉత్తరదక్షిణాలుగా అనంతంగా వ్యాపించిన మైళ్లకుమైళ్లు వెడల్పున రంగురంగులుగా మెరుస్తున్న ఇసుక... మధ్యమధ్య ఇసుక దిబ్బలమధ్య మంచినీటి చెలమలు. ఆ చెలమల చుట్టూ మొగలితోటలు. కొన్ని మైళ్లు పొడవున ఆ మొగలిపొదలు. వాటివెనక కొన్ని వేల ఎకరాల్లో పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా పెంచిన సరుగుడు తోటలు. ఆ తోటల్లో అక్కడా అక్కడా చేపలవాళ్ల పల్లెలు. ఆ పల్లెలున్నచోట సముద్రం ఒడ్డున పడవలు. నిర్మానుష్యమైన సముద్రం ఒడ్డు సౌందర్యంలో మనసు చాలాసేపు మూగవోయింది. కూర్చుని ఆ మహాసౌందర్యాన్ని ఎంతసేపన్నా చూడొచ్చు. చాలాసేపు ఒడ్డున నడిచామేమో కూర్చుందామని ఆగాను.

'ఇక్కడొద్దు అటుపదండి బాబుగారూ' అన్నాడు సాంబం.

ఊళ్లల్లో తిరిగి కావిడిలో చేపలు అమ్ముకునే ఓ తురక పిల్లవాడి మోజులో పడి సాంబంకులంపిల్ల గర్భంతెచ్చుకుని సముద్రంలో పడి చచ్చిపోయిందట. నేను కూర్చుందామన్నచోట ఆమె శవాన్ని పూడ్చారట.

ఒక శృంగారయవ్వనం నా పాదాలకింద ఇసుకగా మారిపోయిందనిపించి, పూలను తొక్కుతున్నాననిపించి పక్కకు తొలిగిపోయాను. ఆ ఇసుకనే చూస్తూ

కొంచెంసేపు నుంచుండిపోయాను. ఈ అనంతకాల ప్రవాహంలో ఒక్కొక్క ఇసుక రేణువూ ఒక్కొక్క కథను చెప్తున్నట్టుగా అన్పించింది.

మరికొంత దూరం నడిచి సముద్రకెరటాలు మమ్మల్ని తాకేంత దగ్గర్లో పొడి ఇసుకలో ఇద్దరం కూర్చున్నాం.

సాంబం తన కథ చెప్పుకున్నాడు. తల్లీతండ్రీ చిన్నతనంలోనే పోయారట. మామయ్య పెంపకంలో పెరిగాడట. చిన్నతనంలోనే తలిదండ్రులను కోల్పోయిన వాళ్లు తప్పనిసరిగా పిరికివాళ్లు అవుతారని నా అభిప్రాయం. లేదా దుర్మార్గులు అవుతారు. సాంబం పిరికి గొంతుకు ఇదొక కారణం. తండ్రి ఆస్తి నాలుగెకరాలు మెట్టపొలం ఉందంట. సావుకారు అప్పుతీర్చటానికి ఆ పొలం అమ్మేయాల్సి ఉంటుందంట. అప్పు తీర్చమనీ, లేకపోతే భూమిని తన పేరున రాసేయమనీ సావుకారు ఒత్తిడి చేస్తున్నాడట! ఎవరూ కొనకుండా చేసి భూమికి ధర రాకుండా అడ్డు పడుతున్నాడట!

జమీందారీ రద్దు, దున్నేవాడిదే భూమి ఇట్లాగే ఉంటుందనిపించింది. అక్కడకు సమీపంలో ఆ సరుగుడు తోటల్లో పల్లె ఉంది. అటువేపు నించి పేంటూ షర్ట్‌లతో ఓ యువకుడు కనిపించాడు. సాంబం అతడిని చూసి లేచి నిలబడి చప్పట్లు కొట్టి కేకేసి పిలిచాడు. 'చేపల ఇన్‌స్పెక్టరండి బాబుగారు, మాదొడ్డ మనిషి' అన్నాడు సాంబం.

'మన ఊర్లోనే తమ మామయ్యగారింట్లో పంచాయితీ బోర్డు పక్కగదిలో ఉండేవోరు. ఆరేడు నెలలయింది పక్క ఊరెల్లిపోయి. తమ కులమే.' అని చెప్పి, అటు ఆయన వస్తున్నవేపుచూసి, 'పేరు సుధాకరరావు. పాటలంటే చెవికోసు కుంటాడు.'అన్నాడు.

సుధాకరరావు పొడుగ్గా సన్నగా ఊగుతున్న నడకతో తమవేపే వస్తున్నాడు.

'నాటకాలంటే, సినిమాలంటే ఇష్టం. వాటికోసం యిశాకపట్నం, శికాకులం, ఇటు బరంపురం — ఒక్కొక్కసారి ఇన్‌స్పెక్టర్ బాబుగారితో నేనూ వెల్తాను.'

'ఏమయిపోయావ్ సాంబం. నీకోసం మీవూరు వెళ్తే ఇటు వచ్చావని చెప్పారు. సరుగుడు తోట వొదిలేసి ఇలా దిగబడ్డావేమిటి?' అని పలకరింపు చూపులతో నావేపు చూశాడు సుధాకర్రావు. నా కన్నా ఐదారేళ్లు పెద్దవాడిలా ఉన్నాడు. కళాకారుడిలాంటి చురుకైన కళ్లు. తెల్లటి చొక్కా, లేత నీలం రంగు పేంట్...

'సుభాష్‌బాబు మామయ్యగారు.'

'శకుంతలమ్మ గారి..'

'తమ్ముణ్ని' అన్నాను.



కథానిలయం
5817
శ్రీకాకుళం

'ప్రెశిడెంట్‌గారు మీ గురించి చాలాసార్లు చెప్పారు.'

అతడి చూపుల్లో నా ప్రియమిత్రులు కన్పించారు. ఎదుటివాళ్ల మంచితనం నమ్మి మాట్లాడే గొంతు, స్వచ్ఛమైన మనసు. కొత్తదనం కనిపించని చూపులు.

సాంబం దగ్గర్లో నాకు ఎదురుగా కూర్చున్నాడు సుధాకరరావు.

'మీరు బాగా పాడతారని..'

చిన్నగా నవ్వు పెదాలమీద విచ్చుకుంది.

తన కళా ప్రతిభను ఇతర్లు గుర్తించినప్పుడు కలిగే సంతోషం. ఉంగరాల జుత్తు గాలికి చెదిరి కొత్తగా ఉంది. చందనం రంగు శరీరం. జీవితంలో ఉన్నదాంతో శాంతించగల చూపులు.

ఇసుకలో పండుకోవాలనిపించింది.

'ఆకాశవీధిలో' పాడాడు. 'కొండగాలి వీచింది' పాడాడు.

ఈపాటలు అక్క వయోలిన్ మీద ఎంత గొప్పగా పలికిస్తుందో...

చుక్కలన్నీ కొండమీద... ఎలుతురంతా మేసి ఏరు నెమరేసింది..

సంధ్యాకాశం చల్లని రంగుల్ని అలంకరించింది.

ఇదే పెన్న...

మాట్లాడని మల్లెమొగ్గ...

అక్కడ సంగీతం శృంగారం అయింది. శృంగారం యౌవనం అయింది. యౌవనం పరిమళం అయింది. అది సాగర సమీరమంతటా వ్యాపించి ఆత్మల ఆక్రందనై, గుండెల్లోతుల్లోకి ప్రవహించింది.

పక్కకి వొరిగి సముద్రాన్ని చూశాను.

సహస్రకోటి తంత్రుల వీణమీద పవనుడి వేళ్లు నాట్యమాడు తున్నాయి.

సాంబం దూరంగా ఉన్న సరుగుడుతోటలలో– ఎవరినో వెతుక్కుంటున్నాడు. సుధాకరరావును చూశాను. శూన్యంలోకి చూస్తున్నాడు. నా కన్నా పెద్దవాడేనేమో. యౌవనం సంస్కారంతోనూ, సాధుత్వంతోనూ అతడి రూపు కళాత్మకంగానూ ఉంది. ఆయన తొడుక్కున్న దుస్తులు నిరాడంబరంగా ఉన్నాయి. ఆయన చూపులు నిర్మలంగా, స్వప్నాలు తొణికిసలాడుతున్నట్టుగా ఉన్నాయి. ముఖంలో త్యాగం పోగేసుకున్న తెల్ల తామర్ల శోభ కన్పిస్తూ ఉంది.

చీకటి పడింది. ఇంటి దారిపట్టాము. సరుగుడుతోటల మధ్యనించి దారి.

'తమరు వెళ్తూండండి' అని పక్కదారి పట్టాడు సాంబం.

కొంచెం ముందుకు నడిచాక సుధాకరరావు చెప్పాడు.

'ప్రేమ' అని.

సాంబం ప్రియురాలు అక్కడ ఎదురుచూస్తుందట. వాళ్ల ప్రేమ సంకేతాలన్నీ తెలిసిన స్నేహితుడు.

'ఆ అమ్మాయితో మాఘంలో పెళ్లిలెండి' అన్నాడు.

'తండ్రి చిన్నప్పుడే పోయాడు పాపం. మేనమామ పెంచాడు. ఆయనే ఈ పెళ్లి చేస్తున్నది.'

సుధాకరరావు మాట పొరపడ్డట్టు విన్పించింది. తల్లీ తండ్రీ చిన్ననాడే పోయినట్టు సాంబం ఇప్పుడే చెప్పాడు.

'తల్లి కూడా పోయింది కదా'

'వీళ్ల కులంలో మారుమనువుంది. భర్తపోయిన కొన్నాళ్లకి ఆమె రెండోమనువు వెళ్లింది. తల్లి మారుమనువాడిందని చెప్పడం సాంబంకి చిన్నతనం. నాతోకూడా ఇదే అబద్దం చెప్పాడు. అడక్కుండానే చెప్తాడు.'

'అవును'

తల్లి గురించి అట్లా మాట్లాడే సాంబాన్ని క్షమించలేకపోయాను.

నాతో పాటే సుధాకర రావు ఇంటికి వచ్చాడు.

* * *

ఆ పాతకాలపు బంగ్లాకు నైరుతి వరండాగది గ్రంథాలయం అయితే ఆగ్నేయ వరండాగది పంచాయితీ కార్యాలయం. మా బావగారి సంస్కారానికి గుర్తుగా మిగిలిపోయింది ఆ గ్రంథాలయం. ఆ గది గోడలకు కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు పంతులు గార్ల ఫోటోలు, గాంధీ మహాత్ముని ఫోటో. అవి చాలు ఆయన అభిరుచి ఏమిటో... ఆ గ్రంథాలయంలో వావిళ్ల వాళ్ల రామాయణ, మహాభారతాలు ఇతర గ్రంథాలు... పెద్దపెద్ద రోజ్‌వుడ్ బీరువాలు...

ఆగ్నేయం గది మామయ్య హోదా...

నగిషీ చెక్కిన పూర్వకాలపు కుర్చీ — అతిథి ఎంత గొప్పవాడన్నా కానీగాక... ఆ కుర్చీలో కూచోవటానికి వీల్లేదు. వాళ్లకోసం పాతకాలం కుర్చీలు వేరే ఉన్నాయి. అవి లోపల్నించి తెప్పించి వేస్తారే తప్ప —

గుండ్రటి రాతి స్థంభాల వరండా విశాలంగా. ఆ వరండాలో పంచాయితీ కార్యాలయం. గదివేపు నగిషీల కుర్చీలో మామయ్య కూర్చుని ఉన్నాడు. నేలమీద ఒక రాతిరాటకు చేరగిలబడి జుత్తునెరిసిన పెద్దవయసాయన కూర్చుని ఉన్నాడు. నుదుట

పొడవాటి కుంకుమబొట్టు, వీపుమీద వేలాడుతున్న జుత్తు, చెవులకు బంగారు గుళ్లు, మెలితిరిగిన మీసాలు. చూట్టానికి ఆ వేషంతో భూతవైద్యుడిలా కన్పిస్తున్నాడు. రెండు వెండిగ్లాసులు — వాళ్లు ఇప్పుడే టీ తాగిన గుర్తుగా అక్కడ ఉన్నాయి.

మొత్తం ఆ బంగ్లా దక్షిణంగా ఎదురుచేసి ఉంటుంది. ఆ ఊళ్లో ఆ బంగ్లా ముళ్లతుప్పల మధ్య మోడువారిన చెట్టులా ఉంది.

రోమన్ అంకెల పెండ్యూలమ్ గోడగడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

వాకిట్లో మేముండగా మామయ్య అప్యాయంగా సుధాకర్రావును తన దగ్గర కూర్చోబెట్టుకున్నాడు. కిందనేలమీద కూర్చోవటమే అలవాటులాగా ఉంది. అతడితో మామయ్య మాట్లాడుతుంటే నేను లోపలికి వెళ్లాను.

నా వేషం చూస్తే అక్కకు అర్థమయినట్టే ఉంది. అయినా

'ఎక్కడికెళ్లావురా?' అని అడిగింది.

'సముద్ర స్నానానికి. నిన్న అనుకున్నాము. సుధాకర్రావు, సాంబం — తీసుకెళ్లారు.'

నా మాట విని పరధ్యానంలో పడిపోయింది అక్క. దుఃఖం ముంచుకొచ్చినట్టుంది. కట్టలు తెంచుకున్నట్టు ఏడుపు.

సముద్రం ఉప్పునీళ్లు ఒంటి మీద చిరచిరగా ఉంది. పెరట్లో బావిదగ్గరకు పోయి స్నానం చేసి రావాలని. ఆ నూతి దగ్గర్లోనే స్నానాల గదులున్నాయి. విడిగా అదొక రెండు గదుల పెంకుటిల్లు. ఒకగదిలో మగవారి స్నానాలు. ఆ గదిలో పెద్దపెద్ద ఇత్తడి బిందెలు. మట్టిగోలాలు. ఉదయమే నూతినుంచి నీళ్లు తోడి పనివాళ్లు అవి నింపుతారు. అయితే ఇప్పుడా గదుల తలుపులు మాత్రం ఊగుతున్నదశలో ఊడిపోయేట్టుగా ఉన్నాయి.

స్నానంచేసి నెమ్మదిగా నేను వచ్చేసరికి, నట్టింట అక్కచుట్టూ ఇంటిజనం గుమిగూడిన దృశ్యం కనిపించింది.

ఆ భూతవైద్యుడు అక్క తల ఓ చేత్తో పట్టుకుని రెండో చేత్తో నడినెత్తి మీది జుత్తుపాయ తీసి, కళ్లల్లోకి తీవ్రంగా చూస్తూ 'ఎవరునువ్వు, నీపేరేమిటి?' అని ఆగ్రహస్వరంతో అడుగుతున్నాడు. శకూ అక్క ఏడుపుమాని, గుడ్లప్పగించి చూస్తున్నది. ఆ భూతవైద్యుడు అదే ప్రశ్న పదే పదే గొంతుపెద్దది చేస్తూ అడుగుతున్నాడు.

ఆ ఊళ్లో చేపలమ్ముకునే తురకబ్బాయి మోజులో పడి ఒక శూద్రపిల్ల కడుపుతెచ్చుకుని సముద్రంలో పడి చనిపోయిందట. ఆ పిల్ల దయ్యమై అక్కను

పట్టుకుని సముద్రం, సముద్రం అని కేకలేస్తుందంట. మొట్టమొదటిసారి ఆ దయ్యం పట్టుకున్నప్పుడు కత్తి పట్టుకుని అక్క పెరట్లోని పూలమొక్కల్ని నరికేసిందంట. చిన్న మొక్కల్ని చేత్తో పీకేసిందంట. పూలకుండీలని ఒక్కటికూడా లేకుండా అన్నిట్ని విరగ్గొట్టిందంట. నిన్నటినించి శకూ అక్క ఏడుపుచూసి మామయ్యకు అనుమానం కలిగి భూతవైద్యుణ్ని రప్పించాడు అని అర్థమయింది.

ఆ భూతవైద్యుడు పళ్లు పటపటకొరికి 'ఎవరు నువ్వు చెప్పు చెప్పు'అని చూపుడు వేలుకు చుట్టి బిగించి పట్టుకున్న జుత్తుపాయను బిగిస్తున్నాడు. అక్క ఆ బాధతో గిలగిల తన్నుకుంటున్నా సరే మాట్లాడటం లేదు. నా వేపు చూసింది. కళ్లు దించుకుంది. ఇట్లా మాట్లాడకపోవడం, ఏడ్వడం, గుడ్లప్పగించి చూడడం — ఆ దయ్యం లక్షణమేనట. మొండి దయ్యమట.

'ఇదిగో, ముందు ఆ జుత్తు విడిచిపెట్టు' అని అరిచాను.

ఆ భూతవైద్యుడు వినిపించుకోలేదు.

నా గొంతువిని నన్నుచూసి జడిసి మామయ్య వెనక్కి తప్పుకున్నాడు.

చుట్టూచేరిన మనుషుల గుంపును పక్కకు తప్పించి 'విడిచిపెట్టు' అని అరచి వాడిని బైటికి నెట్టాను. వాడు పడిపోయాడు నేలమీద. ఒకరిద్దరు నన్ను ఆపబోతుంటే వాళ్లను విదిలించుకున్నాను. వాళ్లని అక్కడ తన్నాలన్నంత కోపమొచ్చింది. అంతా అక్కణ్నించి వెళ్లిపోయారు.

ఈ గొడవకు సుధాకరరావు లోపలికి వచ్చాడు.

శకూ అక్క పిచ్చిగా కూర్చుంది మంచం మీద. జరజరా కన్నీళ్లు కళ్లల్లోంచి జారిపోతున్నాయి.

అక్క పక్కనే కూర్చున్నాను. నా కళ్లల్లోకి చాలాసేపు చూసింది.

'ఇలా చంపుతున్నార్రా' అంది.

మళ్లీ కన్నీళ్లు. మళ్లీ వెక్కి వెక్కి ఏడుపు. లోలోపల దుఃఖం.

'ఏడవొద్దక్కా' అంటున్నానే గాని అప్పుడు అక్క ఏడవటమే మంచిదనిపించింది నాకు. స్వేచ్ఛగా గుండెల్లోని దుఃఖమంతా పొంగి వచ్చేట్టు అక్క ఏడవటమే ఇప్పుడు అవసరం అని తెలుసు. అయినా 'ఏడవొద్దక్కా' అనే వస్తున్నాయి మాటలు.

* * *

సుధాకరరావే — మా ప్రయాణానికి బండి ఏర్పాటు చేయించాడు. మాకు తోడుగా వచ్చాడు. సుభాష్ని మాకు దొరక్కుండా దాచేశారు. చివర్లో చాల

గొడవయింది. పెద్ద పోట్లాట... బాబుని మాతోపాటు తెచ్చుకోలేకపోయాము. శకూ అక్కను అక్కడ ఉంచడం ప్రాణాపాయం అన్న భయం పట్టుకుంది.

అక్క సుభాష్ కోసం ఏడుస్తున్నది. తల్లి మనసు. నిజమే, కాని ముందు ఆపద ఆమె ప్రాణానికి. కొంతసేపు నాతోపాటు ఓదార్పు మాటలు చెప్పిన సుధాకరరావు గొంతు మధ్యలో ఆగిపోయింది. 'ఏమిటి మాటాడరేం?' అని ముఖం తిప్పబోతే చేతికి చల్లగా కన్నీళ్లు.

'ఎందుకేడుస్తున్నారు? ఎందుకేడుస్తున్నారు?' అన్నాను.

'రెండేళ్లపాటు ఈ చిత్రహింస చూశాన్నేను. కాని కాపాడలేకపోయాను. నేను పరాయివాణ్ని. నోరు విప్పితే అనుమానించే మనుషులు. మీరు రక్షించగలిగారు. ధైర్యంగా ఎదిరించి, తిట్టి, భయపెట్టి ఆ చిత్రహింసలనించి ఆమెని కాపాడుకోగలిగారు. తమ్ముడంటే, అన్నయ్యంటే, అక్కాచెల్లెళ్లంటే — భార్యా బిడ్డలంటే అనుబంధాలన్నీ అధికారాలే కదా!'

సుధాకరరావు కన్నీరు అందుకేనా?

'నేను ఏమీచెయ్యలేక ఆ పక్క గదిలోనే ఉండి— ఆమె నిత్యం భరిస్తున్న చిత్రహింస చూడలేక అక్కణ్నించి పొరుగూరు పారిపోయాను.'

సొంత దుఃఖంలో శకూ అక్క

ఎడ్లగంటల గణగణమోత. బండి చక్రాలు రాళ్ల మీంచి నడుస్తున్న శబ్దం. ఎడ్ల అడుగుల క్రమబద్ధమైన లయ. బండి ఇరుసు కిర్రు కిర్రు రాగం. సముద్రపు హోరు. చల్ల గాలి.

సుధాకరరావు గొంతు అక్క వింటున్నట్టులేదు. బలహీనమైన గొంతుతో ఏడుస్తూనే ఉంది. రావటం ఇష్టంలేదా అని అడిగితే నోరు విప్పదు.

ముందు అక్క ఆరోగ్యం బాగుపడాలి. తర్వాత ఆమె ఇష్టం.

మాతృప్రేమ నిజమేకాని అక్క ఆరోగ్యం. సొంత బాధలనించి తప్పించు కోవటం ఇప్పుడు అక్కకు అన్నిటికన్నా ముఖ్యం. ప్రేమా, బాధ్యతా అక్క బతికి ఉంటేనే. అక్కడ ఊపిరాడని ఆ చీకటి గుహల్లో ఉండటం ఇష్టంలేదని కన్నీటితో అక్క చెప్పింది. భాషతో పలకలేకపోవచ్చు. మామగారికి సుభాష్, వంశోద్ధారకుడు కావాలి. కాని కోడలు... నాకు నా అక్క కావాలి.

'బాబును వారం రోజుల్లోపే మీ దగ్గరకు స్వయంగా మీ మామయ్యగారే తెచ్చేట్టు నేను చూస్తాను. మీరు ఏడవ్వొద్దు. అన్నీ మంచికే జరుగుతున్నాయి' అని సుధాకర్రావు ఓదార్పుమాటలు సైతం అక్క కన్నీళ్లను తుడిచేయలేక పోతున్నాయి.

వేకువ జామున — తూర్పు ఆకాశం తెలతెల విచ్చుకుంటూ ఉండగా మా ఎడ్లబండి జంక్షన్ చేరుకుంది. మాతోపాటు రైల్వేస్టేషన్ వరకూ వచ్చి సాగనంపుతాడనుకున్న సుధాకరరావు మమ్మల్ని బస్సులో ఎక్కించి 'మళ్లీ కలుద్దాం. నేనుంటాను' అని దరహాసవదనంతో వీడ్కోలు పలికాడు. బస్సు పరుగు హెచ్చినకొద్దీ సుధాకరరావు ఆకారం చిన్నదై, ఇంకా చిన్నదై, చివరకు అక్కడి నేలరంగులో, అక్కడి ఆకాశం రంగులో కలిసిపోయింది.

★★★

– ఆంధ్ర సచిత్ర వారపత్రిక

*1.12.1967*